క్లుప్తంగా

పదోన్నతిపై ఇద్దరు కార్యదర్శుల రాక

ప్రత్తిపాడు: వివిధ పంచాయతీల్లో జేఏబీసీలుగా పని చేస్తున్న ఇద్దరు పదోన్నతిపై ప్రత్తిపాడు మండలానికి కార్యదర్శులుగా బదిలీపై వచ్చారు. తుని మండలం ఎస్.అన్నవరం గ్రామ జేఏబీసీగా పనిచేస్తున్న దడాల నాగ మహేష్, కోటనందూరు గ్రామ పంచాయతీ జేఏబీసీగా పని చేస్తున్న వేగి సుబ్బారావులకు పదోన్నతులు లభించాయి. వీరు గ్రేడ్–2 కార్యదర్శులుగా దడాల నాగ మహేష్ ఒమ్మంగి గ్రామ పంచాయతీ, వేగి సుబ్బారావు చినశంకర్లపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శులుగా పదవీ బాధ్యతలు చేపట్టారు.

జగ్గంపేట ఎస్సైగా రఘునాథరావు



జగ్గంపేట: జగ్గంపేట ఎస్సైగా టి.రఘునాథరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. జడ్డంగి ఎస్సైగా పనిచేస్తున్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నవీన్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సై రఘునాథరావు మాట్లాడుతూ జగ్గంపేటలో శాంతి భద్రతలు, ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు.

ఆకాశంలో గబ్బిలాల ప్రదర్శన



ప్రత్తిపాడులో ఆకాశంలో చక్కర్లు కొడుతున్న గబ్బిలాలు

ప్రత్తిపాడు: ఎక్కడి నుంచి వచ్చాయో తెలియదు కానీ హఠాత్తుగా వందల సంఖ్యలో గబ్బిలాలు ఆకాశంలో చక్కర్లు కొట్టాయి. ప్రత్తిపాడు ప్రభుత్వ కార్యాలయాల సముదాయం వద్ద ఉన్న చెట్లపై గబ్బిలాలు స్థిర నివాసం ఏర్పరచుకున్నాయి. క్షీరద జంతు జాతికి చెందిన గబ్బిలాలు సూర్యాస్తమయం కాగానే ఇళ్ల లోంచి, చెట్ల గుబుర్లలోంచి బయటకు వచ్చి అతి వేగంగా ఎగిరిపోతూ ఉంటడం మనకు నిత్యానుభవమే. కాగా బుధవారం మధ్యాహ్న సమయంలో ఎక్కడి నుంచి ఊడిపడ్డాయో తెలియదు కానీ వందల సంఖ్యలో గబ్బిలాలు సుమారు గంటకు పైగా ఆకాశంలో చక్కర్లు కొట్టాయి. ఈ దృశ్యాన్ని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. పలువురు దృశ్యాలను తమ సెల్ ఫోన్లలో చిత్రీకరించారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

శంఖవరం: రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సరిత సూచించారు. మండలంలోని పి.మల్లాపురం పీహెచ్‌సీ, శంఖవరం పీహెచ్‌సీని బుధవారం ఆమె సందర్శించారు. రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయాలని సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉండడంతో గిరిజనుల ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గిరిజన పాఠశాలను పరిశీలించి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్, సౌమ్యశ్రీ, ఎంపీహెచ్ఈఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు



నరేంద్రపట్నంలో సామూహిక సీమంతాలు

జగ్గంపేట: మండలంలోని నరేంద్రపట్నంలో బుధవారం మిషన్ శక్తి, బేటీ బచావో–బేటీ పడావో, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ మాట్లాడుతూ మిషన్‌శక్తి పథకం ద్వారా యువతులు, మహిళలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బుర్రి సత్యనారాయణ, ఉంగరాల శ్రీనివాస్, బుర్రి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తొండంగి: మండలంలోని ఏవీ నగరం, ఒంటిమామిడి, అన్నయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో జగ్గంపేట ఈఈ రత్నాలరావు తెలిపారు. ఆయా విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.



ఏలేశ్వరంలో జాతీయజెండాలు ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు



కత్తిపూడిలో జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



జగపతినగరంలో జాతీయ జెండాలతో ప్రదర్శన

వెల్లివిరిసిన దేశభక్తి

- ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు
- గ్రామాల్లో ప్రజలకు జాతీయ జెండాల పంపిణీ



వి.కొత్తూరులో హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థినులు

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరులో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థినులు బుధవారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కేజీబీవీ ప్రిన్సిపాల్ అమృతవాణి ఆధ్వర్యంలో విద్యార్థినులు ర్యాలీ చేశారు. కేజీబీవీ భవనంలో జాతీయ జెండాను చేతపట్టి వందనం చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగురవేయాలి

ఏలేశ్వరం: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయజెండాను ఎగురవేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు అన్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో బుధవారం ఇంటింటికీ జాతీయ జెండాలు పంపిణీ చేశారు. ప్రజలు తమ ఇళ్లపై జాతీయజెండాలు ఆవిష్కరించి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లపూడి గణేష్, గొల్లపూడి సత్యనారాయణ, పోతాబత్తుల పెదబాబు, దొంతంశెట్టి చంద్రశేఖర్, అలేటి అనిల్, పలివెల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వపడేలా స్వాతంత్య్ర వేడుకలు

తుని: దేశం గర్వపడేలా స్వాతంత్య్ర వేడుకలు జరుపుకోవాలని తుని ఎమ్మెల్యే యనమల దివ్య పిలుపునిచ్చారు. తుని రాజా కళాశాల మైదానంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం ఆమె ప్రారంభించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన వందలాది మంది విద్యార్థులు ర్యాలీకి తరలివచ్చారు. రాజా కళాశాల మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. సూరవరం రోడ్డు, మెయిన్ రోడ్డు మీదుగా మువ్వెన్నుల జెండాతో గొల్ల అప్పారావు సెంటర్‌కు చేరుకుని విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జీఎన్‌టీ రోడ్డు మీదుగా రాజా కళాశాల మైదానం వరకు ర్యాలీ కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్లు కుసుమంచి శోభారాణి, యినుగంటి సత్యనారాయణ, యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతంనీడి అబ్బాయి విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దేశభక్తి చాటాలి

కిర్లంపూడి: ప్రతిఒక్కరూ దేశభక్తిని చాటాలని బీజేపీ మండలాధ్యక్షుడు యడాలి రాంబాబు పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జగపతినగరంలో స్థానికులతో కలిసి జెండా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్య్రం వచ్చిందన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటిపై జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని కోరారు.

దేశభక్తిని చాటుదాం

గండేపల్లి: ప్రతిఒక్కరూ దేశభక్తిని చాటాలని తహసీల్దార్ ఆర్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ సురేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శంఖవరం: మండలంలోని కత్తిపూడి సీతారామా కళాశాల విద్యార్థులు బుధవారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. దేశ సమైక్యతను చాటుతూ నినిదాలు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.అక్కారావు, చక్రవర్తి, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబు

ప్రత్తిపాడు: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు స్వాతంత్య్ర వేడుకలకు ముస్తాబయ్యాయి. స్థానిక మండల పరిషత్, తహసీల్దార్, విద్యాశాఖ, సబ్ రిజిస్ట్రార్, పోలీస్ స్టేషన్ తదితర కార్యాలయాలతో పాటు విద్యాసంస్థలు కూడా వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నాయి. రంగురంగు కాగితాలతో కార్యాలయాలను సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. కాగా స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు విద్యాసంస్థలు బుధవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించాయి. మండలంలోని ప్రత్తిపాడు, ఏలూరు, చినశంకర్లపూడి, పెదశంకర్లపూడి, లంపకలోవ తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడాపోటీలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు.

150 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ

ప్రత్తిపాడు రూరల్: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఒమ్మంగిలో బుధవారం 150 అడుగుల భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. శ్రీభారతి విద్యానికేతన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు జెండాలు చేతబూని ర్యాలీ చేశారు. ఈ ర్యాలీని స్థానికులు ఆసక్తిగా తిలకించారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ర్యాలీ చేసినట్టు కరస్పాండెంట్ సుంకర వీరబాబు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఒమ్మంగిలో 150 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



తునిలో విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే దివ్య

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి



గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మౌలిక వసతులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

గోకవరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిచాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, గోకవరంలో ప్రభుత్వాస్పత్రిని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థుల సంఖ్య, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనుల పురోగతి తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. తంటికొండలో ఎంపీపీ పాఠశాలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలని, పాఠశాల ఆవరణలో పారిశుధ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. గోకవరం ప్రభుత్వాస్పత్రిని పరిశీలించి సిబ్బంది హాజరును తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న మందుల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సరస్వతి, తదితరులు ఉన్నారు.

వైద్య విద్యార్థిని హత్యకు నిరసన



కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

గోకవరం: కోల్‌కతాలో వైద్య విద్యార్థిని దారుణ హత్యను వ్యతిరేకిస్తూ మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి ఆవరణలో బుధవారం వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. ఎంపీహెచ్ఈఓ డీఎస్ మూర్తి ఆధ్వర్యంలో ఈ నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు సమాజానికి అత్యవసర సేవలు అందిస్తున్నారని, అటువంటి వారిపై ఇటీవల కాలంలో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినిని హత్య చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చీడపీడల నివారణతో అధిక దిగుబడులు



ఎన్.చామవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

తుని రూరల్: పత్తి సాగులో చీడపీడలు, పురుగులను నివారించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.దయాకర్, డాక్టర్ ఏఎస్ఆర్ శర్మ అన్నారు. మండలంలోని ఎన్.చామవరంలో బుధవారం శాస్త్రవేత్తలు పర్యటించారు. గ్రామంలోని పత్తిచేలను పరిశీలించారు. పత్తి పంటను గులాబి రంగు పురుగులు ఆశిస్తున్నట్టు గుర్తించారు. పూత, పిందె దశల్లో ఆశించే గులాబి రంగు పురుగులను సకాలంలో గుర్తించి, లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయడం ద్వారా నివారించాలన్నారు. లింగాకర్షక (ఎర) బుట్టలు ఏవిధంగా అమర్చాలో రైతులకు క్షేత్రస్థాయిలో వివరించారు. పత్తిసాగు చేసే రైతులు సరైన యాజమాన్య పద్ధతులు అవలంబించడం, చీడ పీడలను నివారించడం తప్పనిసరి అన్నారు. గ్రామ, మండల వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ బి.అశోక్ కుమార్, వీఏఏలు శైలజ, బ్రహ్మనాయుడు, రైతులు పాల్గొన్నారు.

వరుస నాట్లుతో మెరుగైన ఫలితాలు



డి.పోలవరంలో రైతులకు వరిలో పునరోత్పత్తి శక్తిపై అవగాహన కల్పిస్తున్న ఏఓ అశోక్ కుమార్

కోటనందూరు: తాడుకట్టు విధానం (వరుసనాట్లు)లో నాట్లు వేయడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని కాకరాపల్లిలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ తాడు కట్టు విధానంలో మామూలు పద్ధతిలో కన్నా అధిక దిగుబడులు సాధించడంతో పాటు చీడపీడలు, దోమల ఉధృతి గణనీయంగా తగ్గుతుందన్నారు. దమ్ము సమయంలో భాస్వరం, పొటాష్ ఎరువులు వేయడం వల్ల మొక్క భారీగా పిలకలు వేసి మంచి దిగుబడులు వస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శివకుమారి, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు పొలంబడిపై అవగాహన

తుని రూరల్: దుబ్బు చిగుర్లు కత్తిరించినా, పిలకలు తీసివేసినా వరిలో పునరుత్పాదక శక్తి కొనసాగుతుందని మండల వ్యవసాయాధికారి బి.అశోక్ కుమార్ అన్నారు. మండలంలోని డి.పోలవరంలో రైతులకు బుధవారం పొలంబడి కార్యక్రమంలో అవగాహన కల్పించారు. సోకి రెమ్మల కత్తిరింపు, పిలకలు తొలగింపు, సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగులు మందులు వాడాలని సూచించారు. వీఏఏలు లోవరాజు, శ్రీను, శ్రీనివాసు, శివాజీ, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

20 మంది రక్తదానం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ ఆవులమంద గ్రామంలో బుధవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించారు. స్ఫూర్తి ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ యాదాల శ్రీను జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 20 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఎస్.శ్రీనివాస్, గ్రూప్ సభ్యులు, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ గ్రూప్ ఫౌండర్ పెంకే దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నేటి నుంచి వనదుర్గమ్మ జాతర మహోత్సవాలు



వనదుర్గ అమ్మవారి ఆలయం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణమాస జాతర మహోత్సవాలు గురువారం నుంచి ఈ నెల 19 వరకూ నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. తొలిరోజు అమ్మవారిని 'బాల త్రిపురసుందరి'గా అలంకరించి పండితులు పూజలు చేస్తారు. పౌర్ణిమ వరకూ రోజుకో అలంకరణ చేస్తారని చెప్పారు. గురువారం ఉదయం తొమ్మిది గంటలకు వనదుర్గ అమ్మవారి ఆలయంలో పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం నిర్వహించి జాతర మహోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. నవధాన్యాలతో మండపారాధన, కలశస్థాపన చేస్తారు. 50 మంది రుత్విక్కులు నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, మూలమంత్ర జపాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకూ అమ్మవారికి రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహిస్తారు. ఈ నెల 31న పౌర్ణిమ సందర్భంగా అమ్మవారికి నిర్వహించే ప్రత్యంగిర హోమంతో శ్రావణమాస పూజలు ముగుస్తాయని చెప్పారు.

శిక్షణ సమాప్తం

- పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు ముగిసిన శిక్షణ తరగతులు
- పలు అంశాలపై అవగాహన కల్పించిన అధికారులు

ఏలేశ్వరం: సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడురోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు ముగిశాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు పంచాయతీల విధులు, నిర్వహణ, అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు. శిక్షణా పూర్తి చేసుకున్న వారికి ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పంచాయతీ విధులు, నిర్వహణ తదితర అంశాలపై శిక్షణ పొందిన సర్పంచులు గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జె.శ్రీనివాస్, మండల విస్తరణాధికారి సూర్యనారాయణ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో సర్పంచులకు ట్రైనింగ్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

గ్రామాల స్వచ్ఛతే లక్ష్యం

కిర్లంపూడి: గ్రామాల స్వచ్ఛతే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గత మూడు రోజులుగా సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. దీనిలో భాగంగా బుధవారం వీధి దీపాల ఏర్పాటు, పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, శాఖల వారిగా కేటాయింపులు తదితర అంశాలపై అవగాహన కలిగించారు. అనంతరం కిర్లంపూడిలోని చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈఓపీఆర్డీ ఎస్.సత్యప్రసాద్, పలు గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణా తరగతులు

రౌతులపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. ఎంపీడీఓ ఎం.ప్రేమ్‌సాగర్ ఆధ్వర్యంలో గ్రామాల్లో వీధిదీపాల నిర్వహణ, పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, గ్రామ స్వరాజ్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు రాపర్తి రామకృష్ణ, తమరాన సత్యనారాయణ, సర్నం శ్రీను, వి.సత్యనారాయణ, మాదాసు దొంగబాబు, చిందాడ పెదరాజు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు



తునిలో సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్న ఈఓపీఆర్‌డీ జయరామ్

తుని రూరల్: గ్రామ పరిపాలన విధివిధానాలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీ జయరామ్ ఆధ్వర్యంలో మూడో రోజు జరిగిన శిక్షణా తరగతుల్లో ఎంపీడీఓ పి.రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చట్టాలపై అవగాహన పెంచుకుని గ్రామీణులకు సుపరిపాలన అందించాలన్నారు. సర్పంచులు, కార్యదర్శుల విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. శిక్షణ తరగతులపై సర్పంచులకు, కార్యదర్శులకు పరీక్ష నిర్వహించారు. ఈఓపీఆర్‌డీ జయరామ్, ఎంఈఓ–2 రామకృష్ణ సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్రత్తిపాడు: గ్రామ పంచాయతీల అభివృద్ధి, నిర్వహణపై పొందిన శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎస్.డేవిడ్‌రాజ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు గ్రామ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులను నిర్వహించిన శిక్షణా తరగతులు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. చివరిరోజు వీధి దీపాల నిర్వహణ, పంచాయతీ రాజ్ చట్టం, పంచాయతీ అభివృద్ధి తదితర అంశాలపై ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, ట్రైనర్లు బి.కామరాజు, ఆర్‌వీవీ రమణ, ఎల్.గంగాధర్, పి.మధుకిరణ్ శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసుకున్న పంచాయతీ సర్పంచులకు ప్రశంసాపత్రాలను ఎంపీడీఓ ఎస్ డేవిడ్‌రాజ్ అందజేశారు.

దివ్యాంగులకు పౌష్టికాహారం పంపిణీ



ప్రత్తిపాడు ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌కు టీవీ బహూకరిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

ఏలేశ్వరం: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు బుధవారం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పౌష్టికాహారం పంపిణీ చేశారు. డీసీసీబీ మాజీ చైర్మన్, తనభర్త దివంగత వరుపుల రాజా జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే సత్యప్రభ దివ్యాంగ పిల్లలకు పౌష్టికాహారం అందజేశారు. వారితో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. తొలుత స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలకు టీవీలు బహూకరణ

ప్రత్తిపాడు/రౌతులపూడి: డీసీసీబీ మాజీ చైర్మన్ వరుపుల రాజా జయంతిని పురస్కరించుకుని ఆయన సతీమణి, ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఎస్సీ బాలుర, ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహాలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ టీవీలను బహూకరించారు. స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని రోగులకు పండ్లు, రొట్టెలను అందజేశారు. రౌతులపూడి మండలంలోనూ సేవా కార్యక్రమాలు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, పార్టీ నాయకులు ఇళ్ల అప్పారావు, పల్లా గోపి, రావూరి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

మంచి లక్షణాలు అలవర్చుకోవాలి



ఉప్పలపాడులో కుందరాజు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తోట నరసింహం

గండేపల్లి: ప్రతిఒక్కరూ మంచి లక్షణాలు, వ్యక్తిత్వాన్ని అలవరచుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ సర్పంచ్ అడబాల కుందరాజు ప్రథమ వర్ధంతి సందర్భంగా మండలంలోని ఉప్పలపాడులో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంగా మార్గాలు వేరైనప్పటికీ కుందరాజు విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. మంచి వ్యక్తిత్వం, స్వభావం కలిగిన వ్యక్తి కుందరాజు అన్నారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచె రాజా, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, గ్రామ సర్పంచ్ అడబాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.